
సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 7 । నవంబర్ । 2023



దండారీ ఉత్సవాలు షురూ

ఆదివాసీ గూడేల్లో దండారీ సందడి మొదలైంది. ఇంద్రవెల్లి మండలంలోని పలు గ్రామాల్లో యేత్మసుర్ పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. IIలో▸



అడుగడుగునా గుంతలే..!

భీంపూర్ మండలంలోని తాంసి(కె), గొల్ల ఘాట్ గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
33.0/20.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

10న జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 10న 17ఏళ్ల విభాగంలో బాలబాలికల జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన క్రీడాకారులు సంబంధిత వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు పోటీల ఆర్గనైజర్ హరిచరణ్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 6300807110 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హెచ్ఎంవీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ నవంబర్ 20నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. 30 రోజుల కొనసాగే శిక్షణకు ఫీజు రూ.15,600 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్నవారు అర్హులని తెలిపారు. వివరాలకు ఆదిలాబాద్ డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె యూసఫ్‌ను 7382840349 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తొలిమెట్టు వలంటీర్లకు శిక్షణ



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఎదులాపురం: తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా వలంటీర్లుగా నమోదు చేసుకున్న విద్యార్థులకు ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఈవో ప్రణీత అతిథి గా హాజరై మాట్లాడారు. వలంటీర్లకు వారి ఇంటి సమీపంలోని పాఠశాలను కేటాయించనున్నట్లు తెలిపారు. ఈమేరకు శనివారం ఆ పాఠశాలలోని పి ల్లలకు బోధన చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ప్రతాప్, నారా యణ, సుజాత్ ఖాన్, ప్రిన్సిపాల్ అచ్చి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు దయాకర్, అష్రఫ్ అలీ, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

- ఇటు రాజీనామాలు.. అటు హెచ్చరికలు
- కాంగ్రెస్‌లో ముదిరిన లొల్లి
- ఆదిలాబాద్ అభ్యర్థి 'కంది'పై అసమ్మతి తిరుగుబావుటా
- పార్టీకి మూకుమ్మడి రాజీనామా
- స్వతంత్ర అభ్యర్థిగా సంజీవ్‌రెడ్డి ఈనెల 10న నామినేషన్
- బోథ్‌లో అశోక్ స్థానంలో గజేందర్ ఎంపిక
- రేవంత్ పర్యటన నేపథ్యంలో అనూహ్య పరిణామాలు



హస్తవ్యస్తం..!

సాక్షి,ఆదిలాబాద్: ఇటు రాజీనామాలు.. అటు హెచ్చరికలతో జిల్లా కాంగ్రెస్‌లో కల్లోలం చోటు చేసుకుంది. హస్తం పార్టీలో ఈ రెండు సంఘటనలకు ఆ పార్టీ అభ్యర్థులతో ముడిపడి ఉంది. ఆది లాబాద్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డిపై అసమ్మతి వర్గం తిరుగుబావుటా వేయగా, బోథ్ అభ్యర్థి వన్నెల అశోక్‌ను మార్చితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయా మండలాల వారీగా పార్టీ శ్రేణులు హెచ్చరిస్తున్నాయి. సోమవారం ఈ రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణుల నిరసనలు పెల్లుబికాయి.

ఆదిలాబాద్..

డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సంజీవ్‌రెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు, కార్యకర్తలు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి, దివంగత సి.రాంచంద్రా రెడ్డి గృహంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. సీఆర్ఆర్ మేనల్లుడు పార్టీకి రాజీనామా చేసిన సంజీవ్‌రెడ్డిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దించనున్నట్లు అసమ్మతి వర్గం స్పష్టం చేసింది. ఈనెల 10న నామినేషన్ వేయనున్నట్లు తెలుపడం ప్రాధాన్యత సంతరించుకుంది. పారాషూట్ లీడర్లకు టికెట్లు ఇవ్వమని చెప్పిన అధిష్టానం బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి కొద్ది నెలల క్రితమే చేరిన కంది శ్రీనివాసరెడ్డికి ఎలా ఇచ్చిందని వారు ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండడంతో పార్టీ పరిస్థితులు నిర్వీర్యమవుతున్న స్థితిలో కాపాడుకుంటూ వచ్చామని, అలాంటిది కేవలం డబ్బులున్నాయని ఆర్ఎస్ఎస్ భావాలున్న వ్యక్తికి టికెట్ ఇవ్వడంలో కాంగ్రెస్ సిద్ధాంతాలు ఎటుపోయాయన్నారు. తాము ఏపార్టీలో చేరమని, స్వతంత్ర అభ్యర్థిని గెలిపించుకొని తిరిగి కాంగ్రెస్‌లోనే చేరుతామని అసమ్మతివర్గం స్పష్టంచేయడం గమనార్హం.

బోథ్‌లో..

బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వన్నెల అశోక్‌ను పార్టీ అధిష్టానం మార్చబోతుందన్న ప్రచారంపై ఆ పార్టీ శ్రేణులు మండిపడుతున్నారు. గుడిహత్నూర్, నేరడిగొండ, బోథ్, తాంసిలో మండల కాంగ్రెస్ నాయకులు ఈ పరిణామాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అశోక్‌ను మార్చితే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. అతనికే వెంటనే బీ-ఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ పదవులకు రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు. ఆదివాసీ నాయకుడిని మార్చవద్దని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గొడం గణేశ్ డిమాండ్ చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడి పర్యటనకు ముందు లొల్లి..

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఈనెల 8న ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటిస్తున్నారు. బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటనకు ముందు జిల్లాలో ఈ కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. ఆదిలాబాద్‌లో సీనియర్ నేతల రాజీనామా, బోథ్‌లో అభ్యర్థిని మార్చవద్దని కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్ నేపథ్యంలో ఖరారైన ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నారు. ఆయన బీ-ఫామ్ తీసుకొని జిల్లాకు రానున్నట్లు పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

అశోక్ స్థానంలో గజేందర్

- బోథ్ కాంగ్రెస్ అభ్యర్థి మార్పు
- ఏఐసీసీ నుంచి మూడో జాబితా విడుదల



వన్నెల అశోక్



అడె గజేందర్

బోథ్ కాంగ్రెస్ అభ్యర్థిని ఆ పార్టీ అధిష్టానం మార్చింది. ఈమేరకు ఏఐసీసీ నుంచి సోమవారం రాత్రి మూడో జాబితాలో వెల్లడించింది. ఇందులో రాష్ట్రంలో 16 మంది అభ్యర్థులు ఉండగా.. బోథ్ అభ్యర్థి వన్నెల అశోక్ స్థానంలో అడె గజేందర్‌ను ఎంపిక చేశారు. అక్టోబర్ 27న కాంగ్రెస్ విడుదల చేసిన రెండో జాబితాలో అశోక్‌ను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అయితే ఆయన అభ్యర్థిత్వం మార్పు చేసే యోచనలో పార్టీ ఉందన్న ప్రచారం జోరుగా సాగింది. ఈ క్రమంలో నియోజకవర్గంలోని పలు మండలాల్లో హస్తం శ్రేణులు సోమవారం అశోక్‌ను మార్చవద్దని డిమాండ్ చేశారు. ఒకవేళ మారిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని తుడుందెబ్బ హెచ్చరించింది. అయితే ఏఐసీసీ నుంచి ఈ మార్పు చేస్తూ తాజా జాబితా విడుదల చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ..

గత ఎన్నికల్లో అడె గజేందర్ బీఎస్పీ అభ్యర్థిగా బోథ్ నుంచి పోటీ చేశారు. 2658 ఓట్లు సాధించి ఐదో స్థానంలో నిలిచారు. ఆతర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు. సీఎల్పీ నేత మల్లుభట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో విస్తృతంగా పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెండో జాబితాలో వన్నెల అశోక్ పేరు ఖరారు కావడంతో అసమ్మతికి తెరలేపారు. సీనియర్ నాయకులు నరేశ్ జాదవ్‌తో కలిసి ఇచ్చోడలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థిని మార్చాలని ఆ సమావేశం వేదిక ద్వారా డిమాండ్ చేశారు. ఆ తర్వాత పరిణామాలు చకచకా మారుతూ వచ్చాయి. ఏకంగా అభ్యర్థినే మార్చేశారు.

టికెట్లు అమ్ముకున్నారు..

- కాంగ్రెస్ పార్టీకి మూకుమ్మడి రాజీనామా
- సుజాత, సాజిద్‌ఖాన్, సంజీవ్‌రెడ్డి తో పాటు పలువురు పార్టీకి గుడ్‌బై
- విలేకరుల సమావేశంలో వెల్లడి



రాజీనామా పత్రాలు చూపిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ అధిష్టానం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకున్నారని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని మాజీమంత్రి సీఆర్ఆర్ నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ముగ్గురితోపాటు వారి అనుచరులు హస్తం పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కంది శ్రీనివాసరెడ్డి రేవంత్‌రెడ్డికి డబ్బులు ఇచ్చి టికెట్ కొనుక్కున్నారని ఆరోపించారు. దశాబ్దకాలంగా కాంగ్రెస్‌కు సేవచేసిన తమకు అన్యాయం జరిగిందన్నారు. ఆదిలాబాద్‌లో ఎన్ఆర్ఐకి టికెట్ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని, ఈ నెల 10న నామినేషన్ వేయనున్నట్లు సంజీవ్‌రెడ్డి తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియామకమైన తర్వాత కాంగ్రెస్‌లో డబ్బులే ప్రధానంగా మారాయని పేర్కొన్నారు. ఇంద్రవెల్లి సభ సక్సెస్‌కు కష్టపడ్డామని, అయినా ఫలితం లేకుండా పోయిందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ కంటతడి పెట్టారు. పార్టీని వీడటం బాధగా ఉందని,అయినా సంజీవ్‌రెడ్డిని గెలిపించుకొని తిరిగి పార్టీలో చేరుతామని స్పష్టం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు అశోక్, ముబారక్, సంజయ్, వసీమొద్దీన్, మంగేష్ పాల్గొన్నారు.

'అశోక్‌ను మారిస్తే ఆందోళనలే..'

ఎదులాపురం: కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వన్నెల అశోక్‌ను మారిస్తే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని తుడుందెబ్బ జిల్లా కమిటీ అధ్యక్షుడు గోడం గణేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నాయకులతో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 6 లక్షల 70 వేల ఆదివాసీలను అవమానిస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. అభ్యర్థిని మారిస్తే ఆదివాసీల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందన్నారు. అశోక్ అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ స్పష్టమైన ప్రకటన చేయకుంటే, ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఖానాపూర్ నియోజకవర్గం మినహా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామన్నారు. సమావేశంలో మనోజ్, అశోక్, గణపతి, ప్రకాశ్, ముకుంద్, ప్రకాశ్, దినేష్ , గోవింద్ తదితరులున్నారు.

ప్రలోభాలపై 'సి-విజిల్'లో ఫిర్యాదు చేయండి

- వంద నిమిషాల్లో పరిష్కారం
- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: సి-విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్, సంబంధిత అధికారులతో సోమవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన ట్లు దృష్టికి వస్తే ప్రజలు సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. వీటిని వంద నిమిషాల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. బాధ్యతాయుత పౌరుని చేతిలో బ్రహ్మాస్త్రం సి-విజిల్ యాప్ అని అన్నారు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, నగదు, వస్తువులు, మద్యం మాదక ద్రవ్యాలు పంపిణీ చేయడం, ప్రజల ఆస్తులను అనుమతి లేకుండా ప్రచారాలకు వినియోగించడం, కుల మత ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం, ఓటర్ల రవాణా, అసత్య వార్తల ప్రసారం, చెల్లింపు వార్తలు ప్రచురణ, మారణాయుధాలు కలిగి ఉండడం, ఇతర ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఇందులో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈమేరకు సంబంధిత ఫొటోలు, వీడియోలను యాప్‌లో అప్లోడ్ చేస్తే నిర్ణీత కాల వ్యవధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ జరిపి 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం యాప్ ఫిర్యాదులపై ఈడీఎం రవికుమార్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టోరియల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయించొద్దు

ఎదులాపురం: విద్యా సంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు నేరమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగాపట్టణంలోని ఖానాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం పొగాకు రహిత విద్యాసంస్థగా ప్రకటించారు. పాఠశాలలకు వంద గజాల పరిధిలో గల దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించొద్దన్నారు. నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో హెచ్ఎం సంతోష్, ఉపాధ్యాయులు, పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు నామినేషన్లు దాఖలు

- ఆదిలాబాద్‌లో 4, బోథ్, ఖానాపూర్‌లో ఒక్కోటి చొప్పున..

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పరిధిలోని ఆయానియోజకవర్గాల్లో సోమవారం ఆరునామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 3న ప్రారంభమైన నామినేషన్ ప్రక్రియ 10 వ తేదీతో ముగియనుంది.సోమవారం ఆదిలాబాద్ నియోజకవర్గంలో నలుగురు నామినేషన్ వేశారు.

- ఇందులో బీజేపీ అభ్యర్థిగా పాయల్ శంకర్, స్వతంత్ర అభ్యర్థిగా గాలిపెల్లి నాగన్న, బలిరాజ పార్టీ అభ్యర్థిగా సత్యనారాయణఎల్చర్‌వార్, యువ తులసీ పార్టీ అభ్యర్థిగా వోటర్కార్ సురేశ్ నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటివరకు ఈనియోజకవర్గంలో ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి.
- బోథ్ నియోజకవర్గ పరిధిలో ఒక నామినేషన్ దాఖలైంది. బీఆర్ఎస్ అభ్యర్థిగా అనిల్ జాదవ్ నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.



ఆదిలాబాద్‌లో నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్

- ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలో స్వతంత్ర అభ్యర్థిగా నేతావత్ రాజేందర్ నామినేషన్ వేశారు. ఇదివరకు రెండు నామినేషన్ దాఖలు కాగా, తాజాగా ఈ సంఖ్య మూడుకు చేరింది.
- ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. మరో మూడు రోజుల గడువు మాత్రమే ఉండడంతో ఆయా పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు నామినేషన్ వేసేందుకు మంచి ముహూర్తం కోసం వేచిచూస్తున్నారు.

బోథ్‌లో అనిల్ జాదవ్..

బోథ్: బోథ్ నియోజకవర్గంలో సోమవారం తొలి నామినేషన్ దాఖలైంది. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్‌కు అందజేశారు. అలాగే ఈ నెల 10న కార్యకర్తలు, నాయకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి మరోసెట్ నామినేషన్ దాఖలు చేయనున్నట్లు అనిల్ జాదవ్ తెలిపారు.

ఆస్తులు.. అప్పుల వివరాలు

నామినేషన్ పత్రాల్లో 2019-20 నుంచి 2023-24 వరకు తన ఆదాయ వివరాలు పొందుపరిచారు. 2023-24లో తన ఆదాయం రూ.3,42,820లుగా, సతీమణి హరిప్రియ ఆదాయం రూ.4,85,450లుగా చూపారు. ఆయనపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే తన వద్ద నగదు రూ.2లక్షలు, తన భార్య వద్ద రూ. 50వేలు ఉన్నట్లు చూపారు. తన పేరిట నేరడిగొండ ఎస్బీఐలోరూ.8,57,626తో పాటు రూ.12,954, రూ.39,99,946 డిపాజిట్లు ఉన్నట్లు చూపించారు. ఇదే బ్యాంకులో తన భార్య హరిప్రియ పేరిట రూ.12,88,089 డిపాజిట్ ఉన్నట్లు పేర్కొన్నారు. ఎస్బీఐ ఇన్సూరెన్స్ రూ.18 లక్షలు కట్టినట్లు తెలిపారు. అలాగే తన వద్ద రూ.3,60,000 విలువైన ఆరు తులాల బంగారం, తన భార్య వద్ద రూ.18లక్షల విలువైన 30 తులాల బంగారం ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.21 లక్షల విలువైన ఇన్నోవా కారు తన భార్య పేరిట ఉన్నట్లు తెలిపారు. తన పేరిట రాజురా గ్రామంలో 10ఎకరాలు, తన భార్య పేరటి నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. నేరడిగొండలో ఇల్లు తన పేరిట ఉన్నట్లు వెల్లడించారు. ఇకఅప్పులు తన పేరిట రూ.15,22,598, తన భార్య పేరిట రూ. 13,26,762 ఉన్నట్లు పేర్కొన్నారు.



ఆర్వో చాహత్ బాజ్‌పాయ్‌కు నామినేషన్ పత్రం అందజేస్తున్న అనిల్ జాదవ్

ఎస్టీయూ జిల్లా కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని సంఘ భవనంలో ఆదివారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మూగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జాదవ్ అశోక్ కుమార్, కోశాధికారిగా మనోహర్, అసోసియేట్ అధ్యక్షులుగా రవికుమార్, బానోత్ ఆత్మారాం, జిల్లా ఉపాధ్యక్షులుగా పి.కిషన్, శివప్రసాద్, రవికుమార్, సత్యనారాయణ, జయశ్రీ, అదనపు ప్రధాన కార్యదర్శిగా షేక్ మునీర్, మల్లేశ్, కార్యదర్శులుగా స్వర్ణలత, విశ్వనాథ్, బాపురావు, జావెందర్, భూమేష్, ఆర్థిక కమిటీ సభ్యులుగా గోవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర కౌన్సిలర్లుగా దిలేష్ చౌహాన్, బి.రవీంద్ర, శీతల్ చౌహాన్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జుట్టు గజేందర్, పరిశీలకులుగా భూమన్న యాదవ్ వ్యవహరించారు. కార్యక్రమానికి ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుల రిలీవ్ ఆర్డర్ త్వరలోనే విడుదల కానున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికైన నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు.

- ఎన్నికల కోడ్ ఎఫెక్ట్
- పెరిగిన పోలీసుల తనిఖీలు
- తగ్గిన ప్లాట్ల క్రయవిక్రయాలు
- ఆందోళనలో వ్యాపారులు
- సర్కారు ఆదాయానికి గండి

రియల్.. ఢమాల్!



జిల్లా కేంద్రంలోని ఓ వెంచర్

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జిల్లాలో ఒక్కసారిగా పడిపోయింది. మోడల్ కోడ్ అమల్లో భాగంగా పోలీసుల తనిఖీలు ముమ్మరం కావడంతో భూములు, స్థలాల క్రయవిక్రయాలకు ప్రజలు అంతగా ఆసక్తి చూపడం లేదు. జిల్లా కేంద్రంతో పాటు ప్రధాన మండల కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. ఫలితంగా వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. భారీ లాభాల ఆశతో రూ.కోట్ల పెట్టుబడితో వెంచర్లు ఏర్పాటు చేసిన వారు ప్లాట్లు అమ్ముడు పోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఆశించిన స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరుగకపోవడంతో ఆ శాఖ ఆదాయం కూడా గణనీయంగా తగ్గిపోయింది.

పడిపోయిన క్రయవిక్రయాలు

రియల్ ఎస్టేట్ రంగంపై అసెంబ్లీ ఎన్నికలు తీవ్ర ప్రభావం చూపాయని వ్యాపారులు చెబుతున్నారు. గత అక్టోబర్ 11న షెడ్యూల్ విడుదల కావడం, వెంటనే కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు పెరిగాయి. రూ.50వేలకు మించి నగదు తీసుకెళితే సీజ్ చేస్తున్నారు. ప్లాట్లు, భూములు కొనుగోలుకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం ఉండటంతో ప్రజలు వాటి కొనుగోలుకు ముందుకు రావడం లేదు. ఫలితంగా రియల్ వ్యాపారం పడిపోయింది. జిల్లా కేంద్రంతో పాటు బేల, నేరడిగొండ, బోథ్, ఇచ్చోడ, జైనథ్, బజార్‌హత్నూర్, తాంసి, తలమడుగు వంటి తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి. అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు ప్లాట్లు, భూముల కొనుగోలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రియల్ వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతి నెల వంద వరకు ప్లాట్లను విక్రయించే తాము గత నెల నుంచి ఒక్క ప్లాట్ అమ్మ లేదని ఓ బడా రియల్ వ్యాపారి చెబుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖకు తగ్గిన ఆదాయం

జిల్లా వ్యాప్తంగా ఆస్తులు, ప్లాట్ల విక్రయాల ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రతీ నెల సగటున రూ.4 కోట్ల వరకు ఆదాయం సమకూరేది. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారితో నిత్యం రద్దీగా ఉండే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నెలన్నర రోజులుగా కళ తప్పాయి. డాక్యుమెంట్ రైటర్లు ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి. ప్లాట్లు, భూముల క్రయవిక్రయాలు నిలిచిపోవడంతో జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం కూడా భారీగా తగ్గింది. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఇందులో ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో గతంలో ప్రతి నెల 1500 నుంచి 2వేల వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. వీటి ద్వారా రూ.3.50 కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు ఆదాయం సమకూరేది. ప్రస్తుతం 900 నుంచి వెయ్యి రిజిస్ట్రేషన్లకు పడిపోయాయి. ఆదాయం సైతం భారీగా తగ్గింది. ఇక బోథ్ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ప్రతి నెల 30నుంచి 35 రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా రూ.30లక్షల నుంచి రూ.35 లక్షల ఆదాయం సమకూరేది. ప్రస్తుతం 10 నుంచి 15 రిజిస్ట్రేషన్లు మాత్రమే అవుతుండడం గమనార్హం.

క్రయ విక్రయాలు నిలిచిపోయాయి..

ఎన్నికల నేపథ్యంలో రియల్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. పోలీసుల తనిఖీలతో ప్లాట్లు, భూముల కొనుగోలుకు ప్రజలు ముందుకు రావడం లేదు. వ్యాపారం లేక కార్యాలయాలకే పరిమితం కావల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. ఎన్నికలు ముగిసే వరకు ఇలాగే కొనసాగే అవకాశం ఉంది.

– ఫయాజ్ సిద్దిఖి, రియల్ వ్యాపారి

- జిల్లాకు తిరిగివచ్చిన టీచర్
- ఆలస్యంగా వెలుగులోకి..

ఫలించిన ఉపాధ్యాయురాలి పోరాటం

ఆదిలాబాద్‌టౌన్: తనకు అన్యాయం జరిగిందని హైకోర్టును ఆశ్రయించిన ఓ ఉపాధ్యాయురాలి పోరాటానికి రెండేళ్ల తర్వాత ఫలితం లభించింది. 317 జీవోలో భాగంగా ఉమ్మడి జిల్లా పరిధిలో ఉపాధ్యాయులను గతంలో సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లాలోని బేల మండలం జెడ్పీఎస్ఎస్‌లో ఎస్ఏ హిందీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు ఎం.స్వప్నను మంచిర్యాల జిల్లాకు కేటాయించారు. అయితే ఇందులో తనకంటే జూనియర్లకు ఆదిలాబాద్ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చిన విద్యాశాఖ అధికారులు స్థానికురాలైన తనకు మంచిర్యాలకు పంపిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆమె విన్నపాన్ని సర్కారు తిరస్కరించింది. దీంతో ఆమె రెండేళ్ల క్రితం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ విషయమై హైకోర్టు ఆమెకు జిల్లాలో పోస్టింగ్ కల్పించాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. అయితే కోర్టు తీర్పును జిల్లా విద్యా శాఖాధికారులు పరిగణలోకి తీసుకోకుండా జాప్యం చేశారు. దీంతో మరోమారు ఆమె న్యాయస్థానంను ఆశ్రయించడంతో కోర్టు ముందు హాజరు కావాలని డీఈవోను ఆదేశించింది. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి కోర్టుకు ఇటీవల హాజరయ్యారు. ఈ క్రమంలో ఆ ఉపాధ్యాయురాలికి కొద్ది రోజుల క్రితం తలమడుగు మండల కేంద్రంలో పోస్టింగ్ ఇచ్చారు. కాగా, ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇదే విషయమై డీఈవో ప్రణీతను వివరణ కోరగా.. హైకోర్టు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తలమడుగు జెడ్పీఎస్ఎస్‌లో ఆ ఉపాధ్యాయురాలికి పోస్టింగ్ ఇచ్చినట్లు ఆమె వివరించారు.

క్లుప్తంగా

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ ఆశ్రమ క్రీడా పాఠశాలలో మంగళవారం ఉమ్మడి జిల్లా బాలుర సబ్ జూనియర్ అండర్–14 ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.శ్రీధర్‌రెడ్డి, జి.ఈశ్వర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, బోనాఫైడ్ సర్టిఫికెట్లతో పాఠశాల కోచ్ శివకుమార్ వద్ద రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 15, 16, 17 తేదీల్లో మెదక్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9398430685, 9573866008, 9440064422 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతం వద్ద రేషన్ బియ్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మండల కేంద్రం నుంచి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు బొలెరో వాహనంలో షేక్ జావిద్ అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పది మందిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన పది మందిపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ప్రదీప్ కుమార్ తెలిపారు. పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలో గల వివిధ షాపుల యజమానులు అర్ధరాత్రి వరకు దుకాణాలు తెరిచి ఉంచుతున్నారని పేర్కొన్నారు. రాత్రి 10 గంటల తర్వాత షాపులు తెరిచి ఉంచిన యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.

భార్యను వేధించిన భర్తకు జైలు


ఖానాపూర్: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు 7 నెలల సాధారణ జైలుశిక్ష తోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ సోమవారం తీర్పుచెప్పారు. ఖానాపూర్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్‌కు చెందిన ఆడె పుష్పలత (35)కు ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన ఆడెపు వేణుగోపాల్‌తో 2009లో వివాహమైంది. వీరి కాపురం సజావుగా సాగింది. కొన్నినెలల తర్వాత రూ.5 లక్షల అదనపు కట్నం తేవాలని, మానసికంగా, శారీరకంగా భార్యను వేధించసాగాడు. వేధింపులు తీవ్రం కావడంతో భార్య 2012లో అప్పటి ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై రాము కేసు నమోదు చేశారు. ఏపీపీవో రామకృష్ణ కోర్టులో 9 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి తీర్పునిచ్చారని ఎస్సై వివరించారు.

'ప్రజాఆశీర్వాద సభ' విజయవంతం చేయాలి

మందమర్రిరూరల్: మందమర్రిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో మంగళవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సంపత్, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓట్లే.. సీట్లు లేవు!

జంగ్ తెలంగాణ



- కార్మికవర్గానికి ఏ పార్టీలో దక్కని టికెట్లు
- సింగరేణి నేతలకు మొండిచెయ్యి
- ఈసారి టికెట్ ఆశించినవారికి భంగపాటే
- 12 నియోజవకర్గాల్లో సింగరేణి ఓట్లు కీలకం
- గెలుపోటములను నిర్ధారించేది ఈ ఓటర్లే

శ్రీరాంపూర్: రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశ్రమ సింగరేణి. ఆరు జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సింగరేణి విస్తరించి ఉంది. 43 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు, 28 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఈ సంస్థలో పనిచేస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సింగరేణి అంతటా కలిపి సుమారు 3.5 లక్షల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఈ ప్రాంతంలో పోటీచేసే అభ్యర్థుల గెలుపోటములు డిసైడ్ చేసేది సింగరేణి ఓటర్లే. దీంతో ప్రధానపార్టీలు ప్రతిసారి వారి ఓట్ల కోసమే వెంపర్లాడుతాయి. కాని కార్మికవర్గానికి సీట్లు ఇవ్వడంలో మొండిచెయ్యి చూపెడుతున్నాయి. ఈసారి ఎన్నికల్లో ఒక్క టికెట్ కేటాయించలేదు. దీనిపై సింగరేణిలో తీవ్ర చర్చ జరుగుతోంది. కార్మికవర్గం అసెంబ్లీ గడప తొక్కేదెప్పుడు, తమ గళం వినిపించేదెప్పుడని ప్రశ్నిస్తున్నారు.

జిల్లాల పరిధిలో..

మంచిర్యాల, కుమురం భీం, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో సింగరేణి విస్తరించి ఉంది. ఈ జిల్లాల పరిధిలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, రామగుండం, మంథని, పెద్దపల్లి, భూపాలపల్లి, కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లందు, పినపాక అసెంబ్లీ సెగ్మెంట్లలో సింగరేణి ఓటర్లు కీలకంగా ఉన్నారు. ఇక్కడ పార్టీ అభ్యర్థి గెలవాలంటే కార్మికుల ఓట్లు తప్పనిసరి. దీంతో అన్నిపార్టీలు సింగరేణిలో వారి అనుబంధ కార్మిక సంఘాల మద్దతుతోనే సింగరేణి ఓట్లు వేయించుకోవడం పరిపాటే.

కార్మికవర్గానికి ప్రాధాన్యత ఏది?

రాష్ట్ర సాధనలో సకలజనుల సమ్మె చేసిన చరిత్ర సింగరేణి కార్మికులది. ఇంతటి ఉద్యమ స్ఫూర్తి, ఎన్నో త్యాగాలు చేసి స్వరాష్ట్రాన్ని సాధించిన కూడా సింగరేణి గళం అసెంబ్లీలో వినిపించడం లేదు. ఇటీవల అన్నిపార్టీలు ప్రకటించిన అభ్యర్థుల్లో ఎక్కడ కూడా కార్మికవర్గానికి ప్రాధాన్యత కల్పించలేదు. ప్రస్తుత టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావుకు అధికార బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చిన అధిష్టానం అది నెరవేర్చలేదని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. 2014 ఎన్నికల్లో కార్మికవర్గం నుంచి శ్రీరాంపూర్‌కు చెందిన టీబీజీకేఎస్ నాయకుడు పెట్టం లక్ష్మణ్‌కు టికెట్ ఇవ్వడానికి బీఆర్ఎస్ నిర్ణయించి చివరి నిమిషంలో మొండి చెయ్యి చూపింది.

వారికి మొండిచెయ్యి..

ప్రధాన పార్టీల నేతలు సింగరేణిని పట్టించుకోకున్నా చివరికి ఒకరిద్దరు నేతలు వారి మాతృపార్టీల టికెట్లు ఆశించారు. వారికి కూడా మొండిచెయ్యి మిగిలింది. రామగుండం నుంచి టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య టికెట్ కావాలని బీఆర్ఎస్ అధిష్టానానికి మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఇక్కడ సిట్టింగ్ చందర్‌కే ఇచ్చారు. ఇదే నియోజవర్గంలో కాంగ్రెస్ నుంచి ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ టికెట్ ఆశించిన నిరాశే ఎదురైంది. ఇక కమ్యూనిస్టు పార్టీలది కూడా అదే తీరుగా ఉంది. బెల్లంపల్లి నుంచి రేగుంట చంద్రశేఖర్ అనే సింగరేణి మాజీ ఉద్యోగి సీపీఐ నుంచి టికెట్ ఆశించాడు. పొత్తుల భాగంగా ఇది కాంగ్రెస్‌కు పోయింది. చివరికి చెన్నూర్ ఇస్తారనుకుంటే అక్కడ కూడా వివేక్ రావడంతో నిరాశే మిగిలింది.

సమైక్యాంధ్రలోనే గుర్తింపు

సమైక్యాంధ్రలోనే సింగరేణి కార్మికవర్గానికి గుర్తింపు ఉంది. 2009 కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. అప్పటి ఐఎన్టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రస్తుత టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావుకు ఎమ్మెల్సీగా గుర్తింపునిచ్చారు. అంతకుముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేడారం నుంచి సింగరేణి ఉద్యోగి మాలేం మల్లేశ్‌కు టీడీపీ టికెట్ ఇచ్చి గెలిపించింది. తర్వాత 2004 ఉద్యమ సమయంలో కేసీఆర్ సింగరేణి ఉద్యోగి అయిన కొప్పుల ఈశ్వర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో ఆయన గెలిచారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో బెల్లంపల్లి నుంచి సింగరేణి ఉద్యోగి రాజేశ్వర్‌రావు భార్య అమురాజుల శ్రీదేవి, చెన్నూర్ నుంచి బోడ జనార్దన్ టీడీపీ తరుపున గెలిచారు. ఈసారి శ్రీదేవి బెల్లంపల్లి బీజేపీ నుంచి బరిలో నిలిచారు.

పాదరక్షలు లేకుండానే నామినేషన్



నామినేషన్ వేయడానికి వెళ్తున్న అనిల్‌జాదవ్, ఆయన భార్య హరిప్రియ

ఇచ్చోడ: బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ సోమవారం పాదరక్షలు లేకుండానే భార్య హరిప్రియతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా గత నెల 15న అనిల్‌జాదవ్ ఆయన సతీమణి హరిప్రియ ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రోత్సవాలు ముగిసినప్పటికి నెల రోజులుగా ఆయన పాదరక్షలు లేకుండానే ప్రచారం చేస్తున్నారు. సోమవారం బోథ్‌లో నామినేషన్ వేయడానికి భార్యభర్తలు పాదరక్షలు లేకుండానే ఆర్వో కార్యాలయం వరకు నడుచుకుంటూ వస్తున్నారు. అక్కడ ఉన్న వారు ఆసక్తిగా గమనించారు.

బీఫాం అందుకున్న వెడ్మ బొజ్జు



బీఫాంతో వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్ గాంధీభవన్‌లో ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం బీఫాం అందుకున్నారు. అదేవిధంగా ఈనెల 8న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం ఉట్నూర్‌కు వస్తుండగా పార్టీ నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. స్థానిక బస్‌డిపో గ్రౌండ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగసభ ఉంటుందని పేర్కొంటున్నారు. అదేరోజు అభ్యర్థి వెడ్మ బొజ్జు నామినేషన్ వేయనున్నారు.

అలజడి నుంచి ప్రశాంతత వైపు

- పెరిగిన పోలీసుల నిఘా.. నిత్యం తనిఖీలు
- మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నతాధికారుల పర్యటనలు
- సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బలగాలు

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు
మొత్తం 801
సాధారణం 635
సమస్యాత్మకం 113
అంత్యంత సమస్యాత్మకం 53



చెన్నూర్‌లో పోలీసు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

చెన్నూర్: నాడు అలజడి మధ్య ఎన్నికలు జరుగగా, నేడు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఒకప్పుడు చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో మావోయిస్టుల అలజడి ఎక్కువగా ఉండేది. ఆ రోజుల్లో ఈ రెండు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారింది. ఎన్నికలు ముగిసే వరకు అధికార యంత్రాంగం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహించిన రోజులవి. 1994 నుంచి 2009 వరకు జరిగిన ఎన్నికల సమయంలో మావోయిస్టుల ప్రభావం కనిపించింది. నేటికీ జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలు మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలుగా పేరుంది.

తగ్గిన ప్రభావం

చెన్నూర్ నియోజకవర్గం కోటపల్లి, బెల్లంపల్లి నియోజకవర్గం వేమనపల్లి మండలాలు అటవీ ప్రాంతాలు కావడంతోపాటు గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల సౌకర్యం లేదు. సమాచార వ్యవస్థ సైతం అందుబాటులో లేకపోవడంతో ఈ రెండు నియోజకవర్గాల్లో మావోయిస్టుల ఆధిపత్యం కొనసాగింది. నేడు గ్రామాలకు రవాణా, సమాచార వ్యవస్థ అభివృద్ధి చెందింది. పోలీసుల నిఘాతోపాటు పటిష్టమైన సమాచార వ్యవస్థ మెరుగైంది. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే క్షణాల్లో పోలీసులకు సమాచారం అందుతోంది. దీంతోపాటు మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో నిత్యం పోలీసుల పర్యటనలు, వివిధ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో మావోయిస్టుల ప్రభావం తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయి.

నాటి ఘటనలు

- 1999లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రచారం జోరుగా సాగింది.
- ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోటపల్లి మండలం కొండంపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు పోటు సత్యనారాయణరెడ్డిని చెన్నూర్ దళం బంధించి ఎన్నికల ప్రచారంలో పాల్గొనని ప్రమాణం చేయించి ముక్కు నెలకు రాయించారు.
- గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేయద్దని మవోయిస్టులు అల్టిమేటం జారీ చేశారు.
- కోటపల్లి మండలంలోని మల్లంపేటలో ఫారెస్ట్ కలప డిపోను మావోయిస్టులు దహనం చేయగా సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లింది.
- కోటపల్లి మండలం సిర్సా గ్రామంలో 1999 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లు తీసుకొని వస్తున్న ట్రాక్టర్‌ను ఎదుల్లబంధం వద్ద మావోయిస్టులు దహనం చేశారు. సిర్సాలో ఉప ఎన్నికలు జరిగాయి.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో పోలీసులు



పట్టుకున్న మద్యంతో పోలీసులు

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ శివారు ప్రాంతంలో పక్కా సమాచారంతో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని సోమవారం పట్టుకున్నామని ఎస్సై సాయికుమార్ తెలిపారు. వీటి విలువ రూ.4956లు ఉంటుందన్నారు. అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న బరుకుంట భోజన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ సోమవారం ఓ హోటల్‌లో మద్యం అమ్ముతున్నారని సమాచారంతో దాడి చేసి వాటిని సీజ్ చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. 6.480 లీటర్ల మద్యం విలువ రూ.7,128 ఉంటుందన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బెల్టుషాపుపై దాడి

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపుపై సోమవారం దాడిచేసి మద్యాన్ని పట్టుకున్నామని ఎస్సై లింబాద్రి తెలిపారు. రూ.22,315 విలువైన 45 లీటర్ల మద్యాన్ని పట్టుకుని సీజ్‌చేయడంతోపాటు ఒకరిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బోథ్‌లో మధ్య వయస్సు ఓటర్లే అధికం

- తగ్గిన వృద్ధుల ఓట్లు

ఇచ్చోడ: బోథ్ అసెంబ్లీ నియోజకవర్గం ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానం కాగా, ప్రధాన పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నారు. నువ్వా నేనా అనే రీతిలో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మొత్తంగా చూస్తే ఈ నియోజకవర్గంలో ఓటర్లు అధికంగా మధ్య వయస్సు ఉన్నవారే ఉన్నారు. వృద్ధుల ఓటర్లు చాలా తగ్గాయి. 30 నుంచి 39 ఏళ్ల వయస్సు ఉన్న వారు 62,120 ఓటర్లు ఉండగా, 80 ఏళ్లకు పైగా వయస్సు ఉన్నవారు కేవలం 2,316 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికలో మధ్యవయస్సు ఉన్నవారే కీలకంగా ఉన్నారు.

నియోజకవర్గంలో వయస్సు గల ఓటర్ల వివరాలు

మండలం	18-19	20-29	30-39	40-49	50-59	60-69	70-79	80 పైబడిన
భీంపూర్	554	4,371	5,713	3,272	2,441	1,568	714	213
తాంసి	372	2,176	4,023	2,417	1,938	1,254	544	166
తలమడుగు	828	5,722	8,305	4,799	3,590	2,296	1,010	309
గుడిహత్నూర్	878	5,774	7,552	4,356	2,882	1,664	285	254
ఇచ్చోడ	1,277	8,373	10,122	6,174	4,099	2,301	1,062	344
సిరికొండ	321	1,944	1,913	1,192	791	471	207	54
బజార్‌హత్నూర్	796	5,673	6,779	3,927	2,767	1,864	920	356
బోథ్	1,405	8,551	10,773	6,616	4,825	2,919	1,298	370
నేరడిగొండ	897	5,054	6,940	3,912	2,976	1,591	686	250
మొత్తం	7,328	48,978	62,120	36,665	26,129	15,928	7,226	2,316

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కాలనీలో పెట్రోలింగ్‌కు వెళ్లిన సమయంలో హన్వడే భాస్కర్ తన కిరాణ షాప్‌లో మద్యం విక్రయిస్తున్నాడు. ఆయన వద్ద నుంచి 180 మి.లీ 5 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి అంత్యక్రియలు



అంత్యక్రియలు చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో నిరుపేద అయిన పన్నెల మల్లయ్య (65) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ సిబ్బందితో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయించారు. వైకుంఠరథంలో మృతదేహాన్ని స్థానిక గోదావరికి తీసుకెళ్లారు. భార్య రాజేశ్వరి, కుమారుడు సాయి సమక్షంలో అంత్యక్రియలు చేపట్టారు. ఎస్సై లింబాద్రి, మున్సిపల్ సిబ్బంది మానాల శంకర్, రాకేశ్ తదితరులున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆపరేటర్ మృతి



నేరపాది మృతదేహం

భైంసా: బాసర మండలం కిర్గుల్(కె) గ్రామంలో వరికోత మిషన్ ఆపరేటర్ విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..కర్నాటకకు చెందిన నేరపాది(23) వరికోతల కోసం ముథోల్ ప్రాంతానికి వచ్చాడు. సోమవారం వరికోత కోసం బాసర మండలం కిర్గుల్(కె) గ్రామానికి వెళ్తుండగా రోడ్డుకు ఆనుకుని ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తగలి షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితికిచేరుకున్న అతన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 90 శాతం గాయాలతో ఉన్న నేరపాది మృతిచెందాడు.

రూ.65 లక్షల అల్ప్రాజోలం పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

కామారెడ్డిక్రైం: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో సోమవారం ఉదయం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరున్నర కిలోల అల్ప్రాజోలం పట్టుకుని ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథం తెలిపారు. కామారెడ్డి ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. సిద్దిపేట పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన అంబరి రమేష్ గౌడ్ 6.30 కిలోల అల్ప్రాజోలం తీసుకొని సోమవారం కామారెడ్డి కొత్త బస్టాండ్‌లో నిర్మల్ ఏరియాకు చెందిన వ్యక్తి కోసం ఎదురుచూస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. గతంలో అంబరి రమేష్‌గౌడ్ ఓ ల్యాబ్‌లో సూపర్‌వైజర్‌గా పని చేసేవాడని తెలిపా రు. ఆ అనుభవంతో అల్ప్రాజోలం తయారు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేవాడు. అందులో భా గంగా సోమవారం నిర్మల్‌కు చెందిన లింగేశ్‌ను ర ప్పించి, ఆ ఏరియాకు తరలించేందుకు సిద్ధమవుతుండగా అధికారులు పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.65 లక్షల వరకు ఉంటుందన్నారు. వీ టితోపాటు రెండు బైకులను సీజ్ చేశామని తెలిపా రు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్, కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయకుమార్ పాల్గొన్నారు.

ఇనామ్ భూములు పరిశీలన



భూముల పత్రాలు పరిశీలిస్తున్న సద్దాం

బేల: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 45, 46లోని మొత్తం 16 ఎకరాల 13 గుంటల మసీదు ఇనామ్ భూములను జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సద్దాం సోమవారం పరిశీలించారు. ఇనామ్ భూమిని నవాబుద్దీన్ ఖాజీ అమ్ముకోవడంతో హైకోర్టులో కేసు కొనసాగుతోంది. ఆ భూమిలో వ్యవసాయ సాగు చేస్తుండడం, మసీదులో సేవలు పట్టించుకోకపోవడం, తదితర అంశాలపై ఆరా తీశారు. సద్దాం మాట్లాడుతూ పూర్తిస్థాయి రికార్డులు పరిశీలించాకే త్వరలో వివరాలు వెల్లడిస్తామన్నారు. వక్ఫ్ బోర్డు జూనియర్ అసిస్టెంట్ అశ్వక్ ఉన్నారు.

దండారీ ఉత్సవాలు షురూ



కేస్లాపూర్‌లో పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: ఆదివాసీ గూడేల్లో దండారీ సందడి మొదలైంది. మండలంలోని సమాక, కేస్లాపూర్, వాల్గొండ గ్రామాల్లో సోమవారం భోగి(యేత్మసుర్) పూజలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించారు. గిరి గ్రామాల్లో వారం పాటు గుస్సాడి, కోలాటం నృత్యాల సందడి కనిపించనుంది. ఇతర గ్రామాల దండారీ బృందాలను తమ గ్రామానికి అతిథులుగా ఆహ్వానిస్తామని, తాము ఇతర గ్రామాలకు అతిథులుగా వెళ్తామని ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. దీపావళి తరువాత కోలబోడి పూజలతో ఉత్సవాలు ముగిస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు పెందోర్ భగవంత్‌రావ్, మెస్రం వెంకట్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, యశ్వంత్‌రావ్ తదితరులున్నారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా


నజ్ముల్ షకీబ్


అసలంక

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజిమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్ముదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజిమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజిమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్ముదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజిమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజిమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజిమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్ముదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజిమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావ్‌పాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్జియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్‌్షదీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!


రవితేజ

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

అనుష్క @ 50


అనుష్క

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్


కమల్ హాసన్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.


ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ - ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ- ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.


● బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ- ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.


● గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ- ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం


● సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

- దర్శకుడు మారేష్ శివన్



''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ-''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.